రాయితీపై వరి విత్తనాల పంపిణీ

● జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగువిస్తీర్ణం మేరకు వరి విత్తనాలను రాయితీపై ప్రభుత్వం అందజేయనుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ కోరారు. పాలకొండ వచ్చిన అయన స్థానిక ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం విత్తన పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఎంటీయూ-1064 (84.6 క్వింటాళ్లు), ఎంటీయూ-1121(70.5 క్వింటాళ్లు), ఆర్‌జీఎల్ 2537 రకం (61.8 క్వింటాళ్లు) విత్తనాలు సిద్ధం చేశామన్నారు. మరో రెండు రోజుల్లో ఎంటీయూ-1318, 1224, 1061, 7029 రకాల వంగడాలతో పాటు బీపీటీ 5204 రకం నిర్దేశిత రాయితీపై రైతులకు ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు తమ పాస్ పుస్తకాలు, ఆధార్ నకలు తీసుకువెళ్లి విత్తనాలు పొందాలన్నారు. బయట మార్కెట్‌లో అధిక ధరలకు, నాసిరకం విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి, వ్యవసాయాధికారులు ఎన్ని వాహిని, జె.సౌజన్య, పి.శ్రీదేవి, మన్మథరావుతో పాటు సాంకేతిక పర్యవేక్షకులు అజేయకుమార్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


రైతులకు రాయితీపై విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్ పాల్, సహఅధికారులు

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తం

సీతానగరం: మండలంలోని వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు గర్భిణుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె పీహెచ్‌సీలో గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, సూపరువైజర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మార్గ దర్శకాలను అధికార సిబ్బంది అవగాహన కల్పించుకుని గ్రామాల్లో గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమకూర్చుతున్న పౌష్టికాహారం భుజిస్తున్నదీ లేనిదీ పరిశీలించాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో వైద్య పరిక్షలనంతరం ఇస్తున్న మందులు సకాలంలో వాడుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయానికే వేతన దారులకు మస్తర్లు


గుచ్చిమిలో మస్తరును పరిశీలిస్తున్న మండలస్థాయి అధికారులు

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వేతనదారులకు నిర్దేశించిన సమయానికే క్షేత్రసహాయకుల పర్యవేక్షణలో మేట్‌లు మస్తర్లు వేయాలని ఏపీఓ భాను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టెక్నికల్ సహాయకులతో కలిసి పాపమ్మవలస, గుచ్చిమి గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలసలు నివారించడానికి అర్హులైన వారందరికీ ఇప్పటికే జాబ్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. జాబ్‌కార్డులు పొందిన కుటుంబాల సభ్యులు పనుల్లో పాల్గొంటున్నారని తెలియజేశారు. ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు నిర్దేశించిన సమయానికే మేట్‌లు మస్తరు వేయాలని, పని ప్రారంభించడానికి ముందుగా చేయాల్సిన పనికి టెక్నికల్ సహాయకులు కొలతలు ఇవ్వాలని కొలతల ప్రకారం పనులు చేయించాలని సూచించారు. అధికారులు మస్తరు వేసే సమయానికి వేతనదారులు పనులు చేస్తున్న ప్రాంతంలోనే ఉండాలని స్పష్టం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల మందు పిచికారీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా ప్రతీ గ్రామంలోని మురుగుకాలువల్లో పూడికలు తొలగించి, దోమల నివారణ మందు పిచికారీ చేయడం జరుగుతోంది. వైద్యారోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి, జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన మందులు అందజేయాలన్నారు. అలాగే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. పొగాకు తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడవ్వడంతో పాటు శ్వాస, దృష్టి సమస్యలు వస్తాయని, పక్షవాతం కూడా రావచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ పాల్గొన్నారు.


పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్‌మోహన్‌రావు

పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం వద్దు

గుమ్మలక్ష్మీపురం: పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం ప్రదర్శించవద్దని ఐసీడీఎస్ పీవో సీహెచ్ సుశీలాదేవి అన్నారు. భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మంజూరు చేసిన సెలవులు ముగిశాయని, జూన్ 1వ తేదీ నుంచి యథావిధిగా విధులకు హాజరు కావాలని తెలిపారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, ప్రతీ చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందజేయాలన్నారు. బరువు తక్కువున్న పిల్లలు, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సుశీలాదేవి

కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవు

పాలకొండ రూరల్:

సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. మండలంలోని ఓని, గుడివాడ, కోటిపల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయని, ఏ పార్టీ ఓడినా, గెలిచినా ఒకటిగానే భావించాలని, గొడవలు పడొద్దన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. ముఖ్యంగా యువత సంయమనం పాటించాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.


ఓని గ్రామ ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

క్లుప్తంగా

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు


అంటిపేట కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న కార్యదర్శి శశిభూషణరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం కాలువల్లో పూడికలు తీయించి, దోమలకు స్థావరాలుగా ఉన్న చెత్తకుప్పలను వాహనాలతో తరలించడం, మంట పెట్టి కాల్చడం, పూడికలు తీసిన కాలువల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించినట్లు ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు తెలిపారు. చిన భోగిలి, అంటిపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ మందు పిచికారీని ఆయన పరిశీలించారు.

వాహనాల పత్రాలు ఉండాలి


గంగాడలో వాహనాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

బలిజిపేట: వాహనాలకు సంబంధించిన పత్రాలు అన్నీ ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా రూరల్ సీఐ కె.రవికుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గంగాడ, గలావల్లి గ్రామాల్లో వాహనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. వాహనదారుల వద్ద పత్రాలు ఉన్నవీ, లేనివీ గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా ఉండే వాహనాలను సీజ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. వాహనదారుల వద్ద పత్రాలు లేనట్టు గుర్తించిన వాటిని సీజ్ చేశామన్నారు. జూన్, 4వ తేదీన ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రుతుక్రమం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాలూరు రూరల్: ప్రపంచ రుతుక్రమం, ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని కేఆర్‌పేట సెక్టార్ జనవరి వలసలో సీడీపీఓ బి.సత్యవతి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సత్యవతి మాట్లాడుతూ మహిళలు, కిశోరీ బాలికలు రుతుక్రమంలో ఆరోగ్య పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ సరైన పరిశుభ్రత పాటించాలని సూచించారు. లేనిపక్షంలో రక్తహీనతకు గురవుతారన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో ఏజెన్సీ రైతులు

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు గిరిజన రైతులు తమకున్న కొద్దిపాటి పొలాన్ని నాగళ్లతో దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు ఏజెన్సీ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను 90శాతం సబ్సిడీపై ఇటీవల పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారులు సలహా మేరకు గిరిజన రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం ప్రారంభించారు.

సీమలగూడలో 'ఫ్యామిలీ డాక్టర్'


వైద్యసేవల కోసం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి హాజరైన రోగులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని సీమలగూడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యారోగ్య సిబ్బంది గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, ప్రతీ ఇంటి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ఆరాతీశారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఇదే కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించి, ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

మీ అందరి ఆశీర్వాదాలే నా బలం

● ఎన్నికలకోడ్ నేపథ్యంలో పుట్టినరోజు వేడుకలు వద్దన్న రాజన్నదొర

సాలూరు: ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ,శ్రేణులు, అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలకు జీవితాంతం రుణపడి ఉంటానని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. శనివారం రాజన్నదొర పుట్టిన రోజు నేపథ్యంలో శుక్రవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. మీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నామని వారంతా తెలపగా రాజన్నదొర సున్నితంగా తిరస్కరించారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో నియమనిబంధనలకు అందరు కట్టుబడి ఉండాలని చెప్పారు. ఈ ఏడాది తన పుట్టిన రోజునే హనుమాన్ జయంతి కూడా అవడం మరింత ఆనందంగా ఉందన్నారు. తన పుట్టిన రోజు నాడు తనను, జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తూ స్థానిక ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద పూజలు, ప్రార్థనలు చేసి, ఆ అక్షింతలు, మీ ఆశీస్సులు అందిస్తే చాలన్నారు. వచ్చే నెల4న మీ ఘన విజయంతోపాటు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడనున్న నేపథ్యంలో మీ విజయోత్సవం, పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు రాజన్నదొరను కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భామిని: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, బత్తిలి వైద్యాధికారి కె.దామోదరరావు అన్నారు. మండలంలోని మనుమకొండ గ్రామంలో డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ఇంటి వద్ద గానీ ఇంటి పరిసరాల్లో గానీ మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం లేకుండా చూడాలని సూచించారు. మురుగునీరు ఉన్నచోటనే దోమలు విపరీతంగా పెరుగుతాయని, దోమల కారణంగానే మలేరియా, డెంగీ వంటి జ్వరాలు విజృంభిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరం ఆరోగ్యంగా ఉండాలంటే మనమంతా ఐక్యంగా పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు.

90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

సీతంపేట: ఏజెన్సీ పరిధిలోని రైతులకు వివిధ రకాల విత్తనాలను 90 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వరి విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలను కూడా రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రత్నకుమారి, ఏవో పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, దళాయివలస, ఉల్లిబద్ర, రావుపల్లి, బీవీపురం, చినగుడబ, ఉద్దవోలు, గొట్టివలస గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో నెలకొన్న చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తొలగిస్తున్నారు. అలాగే మురుగునీటి నిల్వలు, కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు శుక్రవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా మురుగునీటి నిల్వలు ఉండకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగానే పారిశుద్ధ్య పనులు, తాగునీటి ట్యాంకులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు.

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. మురుగు కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు తాగునీటి ట్యాంకులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. అలాగే గ్రామ ప్రధాన వీధులు, కాలువలు బ్లీచింగ్ చల్లారు.


సీతంపేట: క్లోరినేషన్ చర్యల్లో నిమగ్నమైన వైద్యారోగ్య సిబ్బంది

50 శాతం రాయితీపై పచ్చిరొట్టవిత్తనాల అందజేత

సీతానగరం: ఖరీఫ్ వరిసాగు చేయాల్సిన భూములలో పోషక విలువలు పెంపొందించడానికి, పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి అవసరమైన సేంద్రియ ఎరువు ఉత్పత్తికి పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై పంపిణీ చేస్తున్నామని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని పెద భోగిలి-1,2 ఆర్బీకేల్లో వీఏఏలు పంపిణీ చేస్తున్న పచ్చి రొట్టవిత్తనాలు నిల్వలను, విక్రయాలకు సంబంధించిన రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ వరిసాగు చేయాల్సిన భూములను సారవంతం చేయడానికి అవసరమైన సేంద్రియ ఎరువు ఉత్పత్తికి ముందుగా మట్టినమూనాలు చేసినట్లు చెప్పారు. మట్టినమూనాలు చేసిన రైతులకు పెదభోగిలిలో ఉన్న రెండు రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై 24 క్వింటాళ్ల కట్టి జనుము, పిల్లిపెసర, జీలుగు విత్తనాలు పంపిణీ చేశామన్నారు. అలాగే మిగతా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన పచ్చిరొట్టవిత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుధీర్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.


ఆర్బీకేలో రైతు అందుకుంటున్న పచ్చిరొట్టవిత్తనాలు

అనుమానిత వాహనాలు, వ్యక్తుల ఆరా


నూతన వ్యక్తుల వివరాలు సేకరిస్తున్న ఎస్సై నరసింహ మూర్తి

మక్కువ: ఈనెల 4వతేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో మక్కువ మండలంలో అనుమానిత వ్యక్తులు, వాహనాలపై ఎస్సై పి.నరసింహ మూర్తి శుక్రవారం ఆరా తీశారు. మండలకేంద్రం మక్కువలోని పలు ప్రధానవీధుల్లో ఎస్సై తన సిబ్బందితో పర్యటించారు. అనుమానిత వాహనాలను పరిశీలించి, వాహనదారులతో మాట్లాడారు. ఎక్కడినుంచి ఏపనిమీద వచ్చారు? ఎన్నిరోజుల నుంచి ఉంటున్నారు? అన్న విషయాలను తెలుసుకున్నారు. అలాగే ఇతర మండలాలు, రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు సంచరిస్తున్నారేమోనని కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన వరకు, తరువాత ఎటువంటి గొడవలకు తావివ్వరాదని పిలుపునిచ్చారు. ఎవరైనా గొడవలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ గొడవలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల పోలింగ్ జరిగిన విధంగానే కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు.

దోమల నివారణకే యాంటీలార్వా ఆపరేషన్

మక్కువ: దోమల నివారణకు కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎంపీడీవో పి.దేవకుమార్ పర్యవేక్షణలో మండలంలోని 21పంచాయతీల్లో యుద్ధప్రాతిపదికన పంచాయతీకార్యదర్శులు శుక్రవారం యాంటీ లార్వా ఆపరేషన్ జరిపించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి ఏఎల్‌వో పిచికారీచేయడంతోపాటు, తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ జరిపించారు. రక్షితమంచినీటి పథకాలు శుభ్రంచేయడంతో పాటు, క్లోరినేషన్ చేయించారు. డ్రైడే, ఫ్రైడేలో భాగంగా అన్ని గ్రామాలలో యాంటీలార్వా ఆపరేషన్ కార్యక్రమం జరిపించి ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చేది వర్షాకాలం కానున్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిచుట్టూ నీరు నిల్వలేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యశాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


కొండబుచ్చమ్మపేటలో పిచికారీ చేయిస్తున్న దృశ్యం

మెరిట్ జాబితా విడుదల

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి, విద్యార్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ యు.రామలక్ష్మి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లలో ప్రవేశాలకు ఇటీవల పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు ఆ పరీక్షా ఫలితాలను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 1వ తేదీ నుంచి జూన్ 15వ తేదీలోపు జాయిన్ కావాలన్నారు. తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ కాపీ సెట్ కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూన్ 15వ తేదీలోగా పాఠశాలను సంప్రదించకపోతే అడ్మిషన్ రద్దు చేస్తామన్నారు.